ఎయిర్‌పోర్టు దగ్గర భూగర్భ మెట్రో

- 2.5 కిలోమీటర్ల అండర్ గ్రౌండ్ నిర్మించే దిశగా ప్రణాళిక
- అక్కడే ఎయిర్‌పోర్ట్ లగేజ్ చెక్ ఇన్ ఉండేలా ఏర్పాట్లు
- ఎయిర్‌పోర్టు ఎక్స్‌ప్రెస్ కనెక్టివిటీతో వరల్డ్ క్లాస్ సిటీగా హైదరాబాద్
- హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి వెల్లడి
- ఘనంగా మెట్రో రైల్ ఐదోవ వార్షికోత్సవం

వేడుకలో మాట్లాడుతున్న ఎన్‌విఎస్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శంషాబాద్ విమానాశ్రయానికి దగ్గరలో 2.5 కిలోమీటర్ల అండర్‌గ్రౌండ్ మెట్రో రైలు మార్గం నిర్మాణం చేయనున్నట్టు హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. సెకండ్ ఫేజ్‌లో రాయదుర్గం నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు చేపట్టనున్న 31 కిలోమీటర్ల మెట్రో కారిడార్‌లో భాగంగా ఈ నిర్మాణం చేస్తామని చెప్పారు. ఇక్కడే ఎయిర్‌పోర్ట్ లగేజ్ చెక్ ఇన్ ఉండేలా ఏర్పాట్లు ఉంటాయన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు ప్రారంభమై ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా అమీర్‌పేట మెట్రో స్టేషన్‌లో మంగళవారం హెచ్‌ఎంఆర్‌ఎల్, ఎల్‌అండ్‌టి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. జానపద గీతాలు, ఒగ్గుకళాకారుల నృత్యాలు, సితార్, సరోద్ ప్రదర్శనలు జరిగాయి. అనంతరం మీడియా సమావేశంలో మెట్రో ఎండి ఎన్‌విఎస్‌రెడ్డి మాట్లాడారు.

2017 నవంబర్ 28న ప్రధాని నరేంద్రమోడీ, సిఎం కెసిఆర్ చేతుల మీదుగా మెట్రో రైలును ప్రారంభించామని, మొదటి రోజునే రెండు లక్షల మంది ప్రయాణించి దేశ చరిత్రలో రికార్డు సృష్టించారన్నారు. ప్రయాణికుల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతున్న తరుణంలో కోవిడ్ ఊహించని నష్టాన్ని తీసుకొచ్చిందని, ఆరు నెలలపాటు మెట్రో కార్యకలాపాలు నిలిచిపోవడంతో ఎల్‌అండ్‌టి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొందన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ఎల్‌అండ్‌టి గట్టిగా నిలబడి ప్రజలకు మెరుగైనా రవాణా అందిస్తుండటం అభినందనీయమన్నారు. ఐదేండ్లు పూర్తయిన తరుణంలో సోమవారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 4.40 లక్షల మంది ప్రయాణించారని, భవిష్యత్తులో ఇంకా పెరిగే అవకాశముందని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడా ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంలో (పిపిపి) నడిచే మెట్రో రైళ్లు లేవని.. ఒక్క హైదరాబాద్‌లోనే ఉందని తెలిపారు. నగరానికి మెట్రో రైలును తీసుకొస్తానని చెబితే అప్పట్లో ఎవరూ నమ్మలేదని.. కానీ పట్టుదలతో, ప్రభుత్వాల సహకారంతో తీసుకొచ్చామని చెప్పారు.

రెండో ఫేజ్‌లో భాగంగా రూ.6,250 కోట్లతో శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు 31 కిలోమీటర్ల మెట్రో మార్గాన్ని నిర్మించేందుకు సిఎం కెసిఆర్ నిర్ణయించారని తెలిపారు. వచ్చే నెల తొమ్మిదిన ఈ పనులకు సిఎం శంకుస్థాపన చేయనున్నారని, పనులు పూర్తయితే హైదరాబాద్ మెట్రో ప్రపంచంలో ప్రఖ్యాతిగాంచిన నగరాల్లో ఒకటిగా నిలిచిపోతుందన్నారు. నాగోలు-రాయదుర్గం బ్లూలైన్ కారిడార్ అనుసంధానంగా ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్ నిర్మాణం ఉంటుందని, రాయదుర్గం స్టేషన్‌కు సుమారు 0.9 మీటర్ల ముందు ఒక స్టేషన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. అక్కడి నుంచి బయోడైవర్సిటీ, ఖాజాగూడ, నానక్‌రామ్‌గూడ మీదుగా ఔటర్‌రింగ్ రోడ్డు పక్క నుంచి పనులు చేపడతామన్నారు. ఔటర్‌రింగ్ రోడ్డు నిర్మాణం సమయంలో మెట్రో అవసరాలకు 500 అడుగుల స్థలాన్ని రైట్‌వే కింద వదిలేయడంతో పనులకు ఎలాంటి ఆటంకం ఉండదని చెప్పారు. మొత్తం 31 కిలోమీటర్ల మార్గంలో 28.5 కిలోమీటర్లు మెట్రో పిల్లర్లపై ట్రాక్ వెళ్తుందని, మిగతా 2.5 కిలోమీటర్లు శంషాబాద్ వద్ద అండర్ గ్రౌండ్ ట్రాక్ ఉంటుందని వివరించారు. ప్రయాణికులు రాయదుర్గం స్టేషన్‌లోనే లగేజీలను ఒకేసారి చెకిన్ చేసుకోవడం ద్వారా ఎయిర్‌పోర్టులో ఎలాంటి ఇబ్బందీ ఉండదన్నారు.

ఎంజిబిఎస్ స్టేషన్ ప్రారంభ సమయంలోనే సిఎం కెసిఆర్ ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రయాణికుల కోసం రైలు నడిపిస్తే బాగుంటుందని తనతో చెప్పారని, అనుకున్న విధంగా ప్రభుత్వం ముందుకురావడం సంతోషకరమ న్నారు. రెండో దశ పనులకు కేంద్రం సహకారం అందించినా.. అందించకపోయినా తామే పనులు చేపడుతామని మంత్రి కెటికేటీఆర్ చెప్పారన్నారు.

5ఏండ్లు.. 31 కోట్ల మంది ప్రయాణం

మెట్రో ప్రారంభమైన ఈ ఐదేళ్ల కాలంలో మెట్రో మూడు కారిడార్లలో దాదాపు 31 కోట్ల మంది ప్రయాణం చేసినట్టు ఎల్‌అండ్‌టీ సిఎండి కెవిబి రెడ్డి అన్నారు. ప్రస్తుతం మూడు కారిడార్లలో సమయపాలనతో ప్రతిరోజూ రైళ్లను నడిపిస్తున్నామని, మెట్రో సూపర్ సేవర్, హాలీడే, టాప్ అప్ కార్డులు, ఫోన్‌పేతో మెరుగైన సేవలందిస్తున్నామని తెలిపారు. ఆన్‌లైన్ టికెటింగ్ ద్వారా 40 శాతం మంది రాకపోకలు సాగిస్తున్నారని, సూపర్ సేవల్లో సర్వర్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కియోలిస్ సంస్థ సహకారంతో ప్రయాణికులకు సులభతర టికెటింగ్‌ను అందిస్తున్నామన్నారు. అనంతరం మెట్రో ప్రయాణాలు చేస్తున్న మొదటి 15 మందిని, ఫోన్‌పే ద్వారా టికెట్ బుక్ చేసుకుని ప్రయాణిస్తున్న మరో 10 మందిని రూ.10 వేల పారితోషికం, మెమెంటోతో సత్కరించారు. ఈ సమావేశంలో కియోలిస్ సిఇఒ బెర్నార్డ్ టాబెరీ, ఫోన్‌పే డైరెక్టర్ రితురాజ్ రౌతేజా తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఏఎంఆర్‌ఎల్ ఎండిగా ఎన్వీఎస్ రెడ్డి..?

హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్(హెచ్‌ఏఎంఆర్‌ఎల్) ఎండిగా ప్రభుత్వం బహుషా తననే నియమించే అవకాశాలు ఉన్నట్టు ఎన్‌విఎస్ రెడ్డి సూచనప్రాయంగా తెలిపారు. నగరంలో తొలిదశలో 69.9 కిలోమీటర్ల మేర మెట్రో నిర్మాణాన్ని విజయవంతంగా తన హయాంలో పూర్తయిందని.. రెండో దశలో ప్రభుత్వం రాయదుర్గం స్టేషన్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు చేపట్టనున్న 31 కిలోమీటర్ల మెట్రో కారిడార్‌కు తనకే బాధ్యతలు అప్పజెప్పవచ్చునన్నారు.

ఆర్‌టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించండి

- యూనియన్లపై ఆంక్షలను ఎత్తేయాలి
- సిఎం కెసిఆర్‌కు తమ్మినేని లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు మంగళవారం ఆయన లేఖ రాశారు. మునుగోడు శాసనసభ ఉపఎన్నిక సందర్భంగా ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలను సిఎం దృష్టికి తీసుకొచ్చామని గుర్తు చేశారు. వివిధ సందర్భాల్లో సంబంధిత శాఖ మంత్రి, ఆర్‌టిసి చైర్మెన్‌కూ వివరించామని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆర్‌టిసి అధికారులు చర్చించినట్టు తెలిసిందని పేర్కొన్నారు. ఇది జరిగి నెల రోజులు కావస్తున్నదని తెలిపారు. ఇప్పటికీ ఆ సమస్యలను పరిష్కరించడంలో ఎలాంటి పురోగతి లేదని విమర్శించారు. దీంతో ఆర్‌టిసి కార్మికుల్లో అసంతృప్తి పెరుగుతోందని పేర్కొన్నారు. 'ఆర్‌టిసి యూనియన్లపై ఆంక్షలను ఎత్తేసి కార్యకలాపాలకు అనుమతించాలని డిమాండ్ చేశారు. 2017, 2021 వేతన ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని కోరారు. గతంలో చేసిన వేతన ఒప్పంద బకాయిలను చెల్లించాలని సూచించారు. ఆర్‌టిసి యాజమాన్యం కార్మికుల నుంచి రికవరీ చేసిన రూ.850 కోట్లను సిసిఎస్‌కు తక్షణమే చెల్లించాలని వివరించారు. సిఎం కెసిఆర్ జోక్యం చేసుకుని తక్షణమే ఆర్‌టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

మరో 16,940 కొలువులు

- డిసెంబర్‌లోనే నోటిఫికేషన్లు జారీ : సిఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మరో 16,940 కొలువులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా పోస్టుల భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) సోమేశ్ కుమార్ వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బిఆర్‌కెఆర్ భవన్‌లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌పై టిఎస్‌పిఎస్‌సి చైర్మన్ బి జనార్ధన్‌రెడ్డితో కలిసి వివిధ శాఖల అధికారులతో సిఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల్లో నియామక ప్రక్రియకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు వివిధ శాఖల్లో వివిధ కేటగిరీల కింద 60,929 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని సోమేశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మరో 16,940 పోస్టుల నియామకానికి త్వరలోనే ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఉద్యోగ నియామకాలు టిఎస్‌పిఎస్‌సి, మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డ్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్, రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ రిక్రూట్‌మెంట్ బోర్డు తదితర ఏజెన్సీల ద్వారా భర్తీ అవుతాయని వివరించారు. నియామకాల ప్రక్రియలో సమయపాలన కచ్చితంగా పాటించడంతోపాటు, రిక్రూట్‌మెంట్ ప్రక్రియ త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సర్వీస్ రూల్స్‌లో చేపట్టాల్సిన మార్పులను పూర్తి చేసి అవసరమైన అన్ని వివరాలనూ టిఎస్‌పిఎస్‌సికి వెంటనే సమాచారం అందించాలని కోరారు. వాటి ఆధారంగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ వచ్చే నెలలో నోటిఫికేషన్లను జారీ చేస్తుందని పేర్కొన్నారు. రిక్రూట్‌మెంట్ ప్రక్రియను ప్రతిరోజూ పర్యవేక్షించాలంటూ సంబంధిత అధికారులను సిఎస్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్పెషల్ సిఎస్ శాంతికుమారి, జిఎడి కార్యదర్శి శేషాద్రి, పిసిసిఎఫ్ ఆర్‌ఎం డోబ్రియాల్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి రవిగుప్తా, ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, రాహుల్ బొజ్జాతోపాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తేజస్వి జ్ఞాపకాలు యువతకు స్ఫూర్తి

ప్రజాశక్తి - కల్చరల్

తేజస్వి ఉన్నత విద్యావంతుడైన యువకునిగా, సామాజిక దృక్పథం, సేవభావం కల పౌరునిగా గొప్పగా గ్రంథస్తం చేసిన డేవిడ్ యువతకు స్ఫూర్తి నిచ్చారని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్ అభినందించారు. వెలుగు లోకి వచ్చే సూర్యుడు మరుగు పడిన విధంగా తేజస్వి అకాల మరణం కుటుంబం సభ్యులకు మాత్రమే కాక సమాజానికే బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీత్యాగరాయ గాన సభ లోని కళా దీక్షితులు కళా వేదిక పై తేజస్వి కుటుంబ, మిత్ర బృందం నిర్వహణలో ఎస్ఎ డేవిడ్ రచించిన అనితర సాధ్యుడు తేజస్వి జీవిత చరిత్ర గ్రంథ అవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిధిగా పరకాల ప్రభాకర్ గ్రంధాన్ని అవిష్కరించి మాట్లాడారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎసినామిక్స్ లో ఉన్నత విద్య అభ్యసించిన తేజస్వి సహృదయత, మేధ సామాజిక బాధ్యత అనితర సాధ్యమని కొనియాడారు. మరణం సహజ మే ఇనా అకాల మరణం తో తేజస్వి మిత్రుల హదయల్లో నిలిచి పోయారని అన్నారు. తేజస్వి తండ్రి జివి రావు మాట్లాడుతూ తేజస్విలో చేగువేర ఆలోచనలు, స్వామి వివేకానంద భావనలు, భగత్ సింగ్ స్ఫూర్తి ఉన్న సామాజిక వేత్త అని వివరించారు. అధ్యక్షత వహించిన గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ తేజస్వి ని శాశ్వతం గా నిలిపేందుకు ఆయన పేరిట అవార్డ్ ను స్థాపించి పేద విద్యార్థులకు బహుకరించాలని సూచించారు. ఆదాయ పన్నుల శాఖ ఉన్నతాధికారి వై.సాయి మాట్లాడుతో సంపాదన లక్ష్యంగా ఉన్నత విద్య అభ్యసించక సామాజిక సేవే ధ్యేయంగా తేజస్వి చదువు కొన్నారని ప్రశంసించారు. భరద్వాజ గ్రంధ సమీక్ష చేశారు. తేజస్వి మాతృ మూర్తి కాశీ అన్నపూర్ణ పాల్గొన్నారు.

వచ్చే నెల 14న ఎఐకెఎంఎస్ రాష్ట్ర కౌన్సిల్

- ప్రధాన కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అలిండియా కిసాన్-మజ్దూర్ సభ (ఎఐకెఎంఎస్) రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను వచ్చే నెల 12న భద్రాద్రి కొత్తగూడెంలో జరగనున్నట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని మార్క్స్‌భవన్‌లో అందుకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. రైతాంగ పరిస్థితులు, అందుకోసం పోరాడాల్సిన మార్గంపై చర్చిస్తామన్నారు.

ప్రీ ఓన్డ్ కార్ల వ్యాపారంలోకి కియా

న్యూఢిల్లీ : కార్ల తయారీదారు కియా కొత్తగా ప్రీ-ఓన్డ్ కార్ల వ్యాపారం 'కియా సిపిఒ'ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ప్రత్యేకమైన కియా సిపిఒ అవుట్‌లెట్లలో ప్రీ-ఓన్డ్ కార్లను విక్రయించడం, కొనుగోలు చేయడం, ఎక్సేంజీ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపింది. 2022 చివరి నాటికి వీటిని 30 అవుట్‌లెట్లకు విస్తరించనున్నట్లు కియా ఇండియా ప్రధాన సేల్స్ అధికారి మ్యూంగ్ సిక్ సోహన్ తెలిపారు. కొత్త కియా కార్స్ యొక్క మూడొంతులు కంటే ఎక్కువమంది వినియోగదారులు రీప్లేస్మెంట్ బయ్యర్స్‌గా ఉన్నారన్నారు. ఈ రంగంలో విస్తృతావకాశాలున్నాయని తాము గుర్తించామన్నారు. తొలుత హైదరాబాద్ సహా 14 పట్టణల్లో 15 అవుట్‌లెట్లను తెరిచినట్లు ఆ సంస్థ వెల్లడించింది.

వెబ్ సిరీస్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

'యూట్యూబ్ కా రాజా ఇంస్టాగ్రామ్‌కి రాణి' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- హైదరాబాద్

'యూట్యూబ్ కా రాజా ఇంస్టాగ్రామ్‌కి రాణి' అనే సినిమా వెబ్ సిరీస్ పోస్టర్‌ను ఆ చిత్ర బృందం ఆవిష్కరించింది. విద్యానగర్‌లోని అంజి డైరెక్టర్ ఆఫీస్‌లో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆ బృందం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముఠా గోపాల్ కుమారుడు జై సింహ పూజ చేసి ప్రారంభించారు. అనంతరం అంజి డైరెక్టర్ క్లాప్ కొట్టగా ఇంస్టాగ్రామ్ పేమ్ ప్రేమలత సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విన్నీ వాక్స్, యశ్వంత్ గౌడ్, సురేష్, కాళీ పాల్గొన్నారు.

ఉచితంగా హీమోఫిలియా ఫ్యాక్టర్ మందులివ్వాలి

- హైదరాబాద్ హిమోఫిలియా సొసైటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రభుత్వం హీమోఫిలియా వ్యాధిగ్రస్తులకు ఉచితంగా అందజేస్తున్న ఫ్యాక్టర్ ఇంజక్షన్లను పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో కూడా అందుబాటులో ఉంచాలని హైదరాబాద్ హీమోఫిలీయా సొసైటీ కోరింది. ఈ మేరకు సొసైటీ కార్యదర్శి సుభాష్ చంద్ర నేతృత్వంలో నాయకులు వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం కోట్ల రూపాయల ఖర్చుతో హీమోఫిలీయా ఫ్యాక్టర్ ఇంజక్షన్‌లను ఉస్మానియా, గాంధీ, నిలోఫర్ ఆసుపత్రులతోపాటు ఆయా జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రులకు సరఫరా చేస్తుందని వారు తెలిపారు. హీమోఫిలీయా వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం, శస్త్ర చికిత్సలు అందించడానికి నిమ్స్ ఆస్పత్రిలో ఆధునాతన, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వసతులతోపాటు రక్త సంబంధిత వైద్య నిపుణులు కలిగిన హీమోటాలజీ విభాగం కూడా అందుబాటులో ఉందని చెప్పారు. నిమ్స్‌లో ప్రత్యేకంగా హీమోటాలజీ వైద్య విభాగం ఉన్నందున హీమోఫిలీయా వ్యాధిగ్రస్తులు అక్కడికే వెళ్తున్నారనీ, హీమోఫిలీయా ఫ్యాక్టర్ ఇంజక్షన్‌లు అందుబాటులో లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. వెంటనే సానుకూలంగా స్పందించిన హరీశ్ రావు నిమ్స్ ఆసుపత్రి ఒఎస్‌డి డాక్టర్ గంగాధర్‌కు తగిన చర్యలు తీసుకోవాలని సూచించినట్టు వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సొసైటీ ప్రతినిధులు సుజాత, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలు

- స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలును విస్మరించిన కేంద్రం
- రైతు ఉద్యమంతోనే వ్యవసాయ చట్టాల రద్దు : విజ్జు కృష్ణన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశవ్యాప్తంగా రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలు నిర్మించి, బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించుతామని ఎఐకెఎస్ సహాయ కార్యదర్శి డాక్టర్ విజ్జు కృష్ణన్ అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఏచూరిగార్డెన్ లో (మల్లుస్వరాజ్యం నగర్) మాలి పురుషోత్తంరెడ్డి, గొర్ల ఇంద్రారెడ్డి ప్రాంగణంలో మూడ్రోజులు నిర్వహించిన తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర రెండో మహాసభ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

అఖిలభారత రైతు సంఘాన్ని రానున్న కాలంలో నిర్మాణాత్మకంగా మరింత పటిష్ట పరిచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అందులో భాగంగానే ఆయా రాష్ట్రాల్లో మహాసభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కేరళ రాష్ట్రం తిరుసూర్‌లో అఖిలభారత మహాసభ నిర్వహిస్తామని తెలిపారు. దేశంలో బిజెపి ప్రభుత్వం ఎనిమిదేళ్ల కాలంలో అవలంబించిన రైతాంగ వ్యతిరేక విధానాలపై రాష్ట్ర మహాసభలో చర్చించి నాయకులకు దిశానిర్దేశం చేసినట్టు తెలిపారు. రైతాంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మోడీ సర్కార్‌ను గద్దె దించేందుకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. రైతాంగం సంక్షోభంలోకి నెట్టబడిందన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య విపరీతంగా పెరిగిందని తెలిపారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెంచి సామాన్య, మధ్యతరగతి ప్రజల నడ్డివిరారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా సాగిన రైతు సంఘాల 13 నెలల పోరాటంలో 750 మంది రైతులు ప్రాణ త్యాగం చేశారని, ఈ పోరాటం భవిష్యత్ రైతాంగ పోరాటాలకు ఆశాకిరణమని చెప్పారు.

గణనీయంగా తగ్గిన మాతృమరణాలు

- శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టం బులిటెన్ విడుదల
- 56 నుంచి 43కు తగ్గుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాతా, శిశు సంరక్షణలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. మాతృమరణాల రేషియో (మెటర్నల్ మోర్టాలిటీ రేషియో) గణనీయంగా తగ్గటంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. తాజాగా విడుదల చేసిన శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టం (ఎస్ఆర్ఎస్) బులిటెన్ 2018-20 ప్రకారం, రాష్ట్రంలో ఎంఎంఆర్ 43కు తగ్గింది. 2017-19లో ఇది 56 ఉండగా, వైద్యారోగ్య శాఖ తీసుకుంటున్న చర్యలతో 13 పాయింట్లు తగ్గింది. తద్వారా అతి తక్కువ మరణాలతో దేశంలో తెలంగాణ మూడో స్థానంలో నిలిచింది. వామపక్ష ప్రభుత్వ పాలనలో ఉన్న కేరళ మొదటి స్థానంలో నిలిచింది. జాతీయ సగటు 97గా నమోదైంది. అంటే తెలంగాణ కన్నా రెట్టింపు. 2017-19లోనూ తక్కువ ఎంఎంఆర్‌లో తెలంగాణ మూడో స్థానంలో నిలిచింది.

రాష్ట్రం ఏర్పడేనాటికి ఎంఎంఆర్ 92గా ఉండేది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల క్రమంగా తగ్గుతూ 43కు చేరింది. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు 49 పాయింట్స్ తగ్గింది. జాతీయ సగటు 2014లో 130గా ఉండగా.. 97కు తగ్గింది. కేవలం 33 పాయింట్ల తగ్గుదల నమోదు కావడం గమనార్హం. కెసిఆర్ కిట్‌తో గర్భిణీల నమోదు, పర్యవేక్షణ పెరగడం, ప్రతి నెలా పరీక్షలు, ఉచితంగా అమ్మ ఒడి వాహన సేవలు, ఎనిమియా సమస్య ఉన్న వారిని గుర్తించి సప్లిమెంటరీ టాబ్లెట్ల పంపిణీ, ప్రతి గర్భిణీకి విధిగా ఐరన్ క్యాప్సుల్స్ ఇవ్వడం, హై రిస్క్ గర్భిణీలను ముందే గుర్తించి పెద్దాస్పత్రికి రెఫర్ చేయడం తదితర చర్యలు మరణాలు తగ్గేందుకు దోహదం చేశాయి.

వెనుకబడ్డ డబుల్ ఇంజిన్ రాష్ట్రాలు

ఎంఎంఆర్ తగ్గుదలలో బిజెపి పాలిత రాష్ట్రాలు వెనుకబడ్డాయి. అత్యధిక మాతృమరణాలు నమోదవుతున్న మొదటి మూడు రాష్ట్రాలు బిజెపి పాలిత రాష్ట్రాలే కావడం గమనార్హం. తాజా నివేదిక ప్రకారం, ఎంఎంఆర్‌లో అస్సాం 195, మధ్యప్రదేశ్ 173, ఉత్తర్‌ప్రదేశ్ 167గా నమోదైంది. 2017-19 నుంచి 2018-20 ఎంఎంఆర్ తగ్గక పోగా పెరిగింది. మధ్యప్రదేశ్‌లో10 పాయింట్లు, హర్యానాలో 14 పెరగగా, ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎంఎంఆర్ తగ్గుదలలో ఎలాంటి పురోగతి నమోదు కాలేదు.

సిబ్బందికి అభినందనలు-మంత్రి హరీశ్ రావు

ఎంఎంఆర్ తగ్గించడానికి కృషి చేసిన వైద్యాధికారులు, సిబ్బందిని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు అభినందించారు. రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు ఈ కృషిని కొనసాగించాలని కోరారు.

జనవరి 18 నుంచి కంటి వెలుగు....

- అప్తో మెట్రిషన్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లను త్వరగా నియమించాలి
- మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కంటి వెలుగు రెండో దశ కార్యక్రమం జనవరి 18 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో 1,500 మంది ఆప్టో మెట్రిషన్లు, 1,500 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్ల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్ రావు ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ప్రాంగణంలో మంత్రి డిఎంహెచ్ఒలు, డిప్యూటీ డిఎంహెచ్ఒలు, క్వాలిటీ బృందాలు, ప్రోగ్రాం ఆఫీసర్లకు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ వంద రోజుల్లో కోటిన్నర మందికి పరీక్షలు చేసి 55 లక్షల మందికి కండ్లద్దాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. వీటిలో 30 లక్షలు రీడింగ్ గ్లాసెస్, మరో 25 లక్షలు ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం రూ.200 కోట్లు వెచ్చించనుందని తెలిపారు. ప్రపంచంలోనే అతి పెద్ద కంటి పరీక్షల కార్యక్రమం కోసం 1,500 బృందాలు శని, ఆదివారాలు మినహా మిగిలిన ఐదు రోజులు పని చేస్తాయని చెప్పారు. 969 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్ల తుది జాబితా వచ్చే నెల ఒకటో తేదీన విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. 1,500 వాహనాలను ఈ బృందాల కోసం ప్రత్యేకంగా కేటాయించినట్టు వెల్లడించారు. రెగ్యులర్ సేవలకు ఇబ్బంది కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజా ప్రతినిధులను భాగస్వాములు చేయాలనీ, జిల్లా కలెక్టర్ల సహకారం తీసుకోవాలని ఆదేశించారు. జనవరి ఐదున జిల్లా కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని తెలిపారు. సమస్య వస్తే వినియోగించుకునేలా అదనపు బృందాలను అందుబాటులో ఉంచనున్నట్టు తెలిపారు. జనవరి ఒకటిన రీఫ్రాక్టో మిషన్లు, కార్యక్రమానికి ముందే రీడింగ్ గ్లాసెస్ అందజేస్తామనీ, పరీక్షలు చేసిన తర్వాత నెల రోజుల్లో ప్రిస్క్రిప్షన్ అద్దాలు ఇస్తామని మంత్రి చెప్పారు. రాష్ట్ర స్థాయిలో 10 క్వాలిటీ కంట్రోల్ టీమ్‌లు, జిల్లాకొక టీమ్ పని చేస్తాయన్నారు. వీరందరికి ఎల్.వీ.ప్రసాద్, సరోజినీ దేవి కంటి ఆస్పత్రి సహకారంతో రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తామని హరీశ్ రావు తెలిపారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమానికి తమ శాఖ సంపూర్ణంగా సహకరిస్తుందని తెలిపారు.

నేడు నియోజక కేంద్రాల్లో ధర్నాలు : రేవంత్ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతు, భూమి సమస్యల పరిష్కారం కోసం బుధవారం అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని టిపిసిసి అధ్యక్షులు, ఎంపి ఎనుముల రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అందుకోసం నియోజకవర్గ సమన్వయ కర్తలు కృషి చేయాలని కోరారు. ఈ మేరకు మంగళవారం రేవంత్ ఒక ప్రకటన విడుదల చేశారు. డిసెంబర్ 5న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేయాలని ఆయన పేర్కొన్నారు.

ఎఎన్‌యుతో టీమ్ లీజ్ ఎడ్ టెక్ జట్టు

ప్రజాశక్తి-హైదరాబాద్

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఎఎన్‌యు) తన దూరవిద్య విద్యార్థులకు సాంకేతిక ఆధారిత విద్యాభ్యాసం, ఉపాధి పొందడంలో నాణ్యతకు సంబంధించిన సేవలను అందించేందుకు టీమ్ లీజ్ ఎడ్ టెక్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యంలో భాగంగా యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (సిడిఇ) విద్యార్థులు ఆన్ లైన్ లెర్నింగ్ మొబైల్ అప్లికేషన్‌కు యాక్సెస్ పొందగలుగుతారని ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ మొబైల్ యాప్ రీడింగ్ మెటీరియల్, యూనివర్సిటీ ప్రొఫెసర్ల ప్రి- రికార్డెడ్ వీడియోలు, సెల్ఫ్ అసెస్ మెంట్ టెస్టులతో సహా మొబైల్ యాప్ ద్వారా విద్యార్థులు యూనివర్సిటీ ఫ్యాకల్టీతో లైవ్ సెషన్స్‌లో కూడా పాల్గొనవచ్చని పేర్కొంది.

సిఎం చేతుల మీదుగా నీరా కేఫ్ ప్రారంభం

మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతిష్టాత్మకంగా హైదరాబాద్ నగరంలో నిర్మించిన నీరా కేఫ్ త్వరలో సిఎం కెసిఆర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు మంత్రి డాక్టర్ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో నీరా పాలసీలో భాగంగా నీరా కేఫ్ ప్రారంభోత్సవం, ఉత్పత్తి, సేకరణ, మార్కెటింగ్, చిల్లింగ్ కేంద్రాల నిర్మాణ పనులపై అబ్కారీ శాఖ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌తో కలిసి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తాటి, ఈత చెట్ల పై నుంచి పడి శాశ్వత అంగవైకల్యం చెందిన గీత కార్మికులకు ప్రభుత్వ ఆస్పత్రిలో మెడికల్ బోర్డ్ ముగ్గురు డాక్టర్లు ఇచ్చే సర్టిఫికెట్ల జారీని సులభతరం చేయాలని ఆదేశించారు. శాశ్వత అంగవైకల్యం పొందిన వారికి సర్టిఫికెట్లను ఆర్థోపెడిక్ అసిస్టెంట్ సర్జన్ ఇచ్చేలా నిబంధనలు సవరించాలని సూచించారు.నీరా ఉత్పత్తి, సేకరణపై సర్వేల్, చారుకొండ, మునిపల్లెలో నిర్మిస్తున్న నీరా చిల్లింగ్ ప్లాంటు నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేయాలన్నారు.

మహారాజశ్రీ మంగళగిరి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No.430/2021 in O.S.No.182/2020
Between:
దామర్ల జగ్గారావు(Died) & 3 ఇతరులు
....పిటీషనర్/వాది
మరియు
M/S.రిలియన్స్ ఇన్‌ఫ్రాటెల్ లిమిటెడ్ & మరియొక్కరు
...రెస్పాండెంట్స్/ప్రతివాదులు
R2: M/S.రిలియన్స్ ఇన్‌ఫ్రాటెల్ లిమిటెడ్
రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్
ఆఫీస్:101, లెక్‌షోర్ టవర్స్, సోమాజీగూడ,
రాజ్‌భవన్ రోడ్డు, హైదరాబాద్, తెలంగాణ-500082

పై నెంబరు పిటీషన్‌లో మొదటి పిటీషనర్ యొక్క Lr'sను పై కేసులో చేర్చవలసిందిగా మరియు ఇతర రిలీఫ్‌ల కొరకు పిటీషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్‌లో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారి అనుమతితో ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియ జేయునది ఏమనగా తేది.30-12-2022న మీ నోటీసు కొరకు వాయిదా వేసియున్నారు. కావున పై తేదీన పై కోర్టు వారి ఎదుట తేది.30-12-2022న ఉదయం గం॥10-30ని॥లకు మీరు స్వయంగా కాని, లేదా మీ న్యాయవాది ద్వారా కాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయని యెడల సదరు పిటీషన్‌ను మీ పరోక్షమందు తీర్మానంచేయబడునని యిందుమూలంగా తెలియపరచడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)
వాయిదా తేది:30-12-2022
ఇట్లు
వంగర కిషోర్, అడ్వకేట్,
మంగళగిరి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

IN THE COURT OF THE HON'BLE XI ADDL. CIVIL JUDGE, CITY CIVIL COURT, AT :: HYDERABAD.
I.A. No. 283 OF 2020
IN
O.S. No. 703 OF 2019
Between:
N. Sangeetha and others
... Petitioner/Plaintiff
AND
Sri M. Kishan and others
... Respondents/Defendent
To
10. M. Pradeep Kumar, S/o. Late M. Mallesh, Aged about 37 Years, Occ. Business R/o. Plot No. 190, Ragha vendra Colony, Near Godavari Homes, Qutubullapur, K.V. Rangareddy, T.S.- 55.
11. M. Sandeep Kumar, S/o. Late M. Mallesh, Aged about 34 Years, Occ. Business R/o. 1-24-29, MD Form, Old Bowenpally, Ranga Reddy District, TS.
...Respondents/ Proposed Defendants
NOTICE
Please take notice that the above named Petitioner/Plaintiff has filed the above said petition in the above said Suit and you were arrayed as Respondent No. 10 and 11 in the above said IA and that the said IA along with Suit is posted on 27.12.2022. Hence, you are hereby directed to appear before the above said Hon'ble court on 27.12.2022 at 10.30 a.m. either in person or through your advocate, failing which the matter will be decided in your absence on the material available on record before the Hon'ble Court.
// BY ORDER OF THE HON'BLE COURT//
M/s. SHIVA SHAKTI ASSOCIATES
Reg.No. 948 of 2021
SURESH SHIVA SAGAR
Advocate
Premises No.5-9-58, Gupta Estates, Ground Floor, Basheerbagh X Road, Hyderabad.T.S. Ph.:040-23235650
Cell : 9246525650

కలిసి పనిచేస్తేనే ఐక్యత

- దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి
- తెలంగాణాలో రైతు సంఘాన్ని బలోపేతం చేయాలి
- ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి హన్నన్ మొల్లా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"నినాదాలతో ఐక్యత రాదని కలిసి పనిచేసి పోరాడితే ఐక్యత వస్తుంది.. రాష్ట్రంలో రైతు సంఘాన్ని మరింత బలోపేతం చేయాలి. ప్రతి గ్రామంలో సంఘం ఏర్పాటు చేసి.. ప్రతి రైతునూ సభ్యునిగా చేర్చుకోవాలి.. సభ్యత్వం నమోదులో కేరళ రాష్ట్రం అత్యధికంగా చేసింది.. ఆ విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని ఎఐకెఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి హన్నన్ మొల్లా అన్నారు. నల్లగొండలో జరిగిన తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర రెండో మహాసభ ముగింపు సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడారు. సంవత్సరానికోసారి గ్రామాల్లో సభ్యత్వాలు పూర్తి చేసి గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. కమిటీలను వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని చెప్పారు. కేరళ రాష్ట్రంలో ఒకే వారంలో 57 లక్షల సభ్యత్వాలు నమోదు అయ్యాయని, ఇక్కడా అలా ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. రైతు నాయకులు ప్రణాళికాబద్ధంగా.. చిత్తశుద్ధితో పనిచేయాలని చెప్పారు.

స్వామినాథన్ సిఫార్సుల అమలుకు సంఘటిత పోరు

స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు కోసం రైతాంగం సంఘటిత పోరాటం చేయాలని ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి పిలుపునిచ్చారు. వ్యవసాయం రైతులకు ఉపయోగకరంగా మారాలంటే ప్రభుత్వ విధానాలు మారాలన్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగిందన్నారు. వరి సాగు లాభసాటిగా లేకపోవటంతో రైతులు ఆ వైపు ఆసక్తి చూపటం లేదని చెప్పారు. ప్రతి గ్రామంలో రైతులతో కమిటీలు ఏర్పాటుచేసి సమస్యల పరిష్కారానికి పోరాటానికి సన్నద్ధం కావాలన్నారు. విద్యుత్ ప్రయివేటీకరణకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగించాలని యోచిస్తున్న కేంద్ర ప్రభుత్వ పతనం ఖాయమని చెప్పారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయడం కోసం కేంద్రం అనేక చట్టాలను తెచ్చిందని, వాటిని అడ్డుకునేందుకు పోరాడాలని అన్నారు. ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నా పాలకులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. గిట్టుబాటు ధరపై అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వమూ పట్టించుకోలేదన్నారు. ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలను అడ్డగోలుగా పెంచాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ధరణి వెబ్‌సైట్ కారణంగా రైతులకు నేటికీ పాస్‌పుస్తకాలందక రైతుబంధు, రైతుబీమా పథకాలకు నోచుకోవడం లేదని వివరించారు.

మహాసభలో మాట్లాడుతున్న హన్నన్ మొల్లా

ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి

రైతులు ఏకమైతే మోడీ ప్రభుత్వం పతనం..

దేశంలో రైతులు, రైతు సంఘాలు ఏకమైతే మోడీ ప్రభుత్వం పతనం ఖాయమన్నారు. మోడీ సర్కార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విమర్శించారు. ప్రయివేటు శక్తులకు దేశ వనరులను అప్పజెప్పుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా అమ్ముతూ.. దేశాన్ని సంక్షోభంలోకి నెట్టేస్తోందని చెప్పారు.

ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి

గిరిజన రైతుల్లో 80 శాతం సన్న, చిన్నకారులే..

గిరిజన రైతుల్లో నూటికి 80శాతం సన్న, చిన్నకారు రైతులుగానే మిగిలిపోతున్నారని గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీరామ్‌నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మెట్ట పంటలకు ఆదరణ తగ్గిందని చెప్పారు. తండాల్లో జీవనాధారం లేక గిరిజన రైతులు వలస వెళ్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. కౌలు రైతులు ఎక్కువగా గిరిజన ప్రాంతాల్లోనే ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం పోడు భూముల రైతులకు హక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, రైతు సంఘం మహిళా రైతు రాష్ట్ర కన్వీనర్ కందాల ప్రమీల, సూర్యాపేట జిల్లా కార్యదర్శి దండ వెంకటరెడ్డి, శెట్టి వెంకన్న, వల్లపు వెంకటేష్ అధ్యక్షవర్గంగా వ్యవహరించిన ఈ మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బొంతల చంద్రారెడ్డి, బండ శ్రీశైలం, సహాయ కార్యదర్శి మూడు శోభన్, మల్లు నాగార్జున రెడ్డి పాల్గొన్నారు.

గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీరామ్‌నాయక్

సఖి సెంటర్లో బాలిక ఆత్మహత్య!

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలోని సఖి సెంటర్లో ఓ బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం కలకలం రేపింది. ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పాలెం గ్రామానికి చెందిన బాలిక (17)కు జిల్లా కేంద్రంలో ఉంటున్న వంశీతో పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారింది. విషయం బాలిక కుటుంబీకులకు తెలియడంతో ఇద్దరినీ మందలించారు. అయినా వినకపోవడంతో యువకునిపై బిజినాపల్లి మండల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలికను, యువకున్ని జిల్లా కేంద్రంలోని సఖి సెంటర్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇప్పించారు. అయినా వినకపోవడంతో యువకునిపై ఫోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. బాలిక మాత్రం సఖి కేంద్రంలోనే ఉండగా.. మధ్యాహ్నం సమయంలో అధికారులు భోజనం కోసం వెళ్లగా.. ఫ్యానుకు ఉరేసుకుంది. ఎస్‌ఐ విజయ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పదో తరగతి విద్యార్థినిపై సామూహిక అత్యాచారం

- తోటి విద్యార్థుల ఘాతుకం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి చదువుతున్న బాలికపై ఐదుగురు తోటి విద్యార్థులు సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. హైదరాబాద్ నగర శివారులోని హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆగస్టులో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. హయత్‌నగర్ సిఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి చెందిన బాలిక పదో తరగతి చదువుతోంది. ఈ ఏడాది ఆగస్టు నెలలో బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమెపై 9,10వ తరగతి చదివే విద్యార్థులు సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. అంతేకాకుండా ఈ దారుణాన్ని వీడియో తీశారు. విషయాన్ని ఎవరికైనా చెబితే వీడియోను సోషల్ మీడియాలో పెడతామని బెదిరించారు. అనంతరం పది రోజుల తర్వాత బాలికపై వారు లైంగికదాడికి పాల్పడ్డారు. అయితే, అప్పటి వీడియోను నిందితులు తాజాగా సోషల్‌మీడియాలో షేర్ చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వీడియో వైరల్ స్థానిక కౌన్సిలర్ దృష్టికి రావడంతో వెంటనే వారు పోలీసులకు తెలియజేశారు. అనంతరం బాలిక తల్లిదండ్రులు విషయం తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని ఐదుగురు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని జువైనల్ హోమ్‌కు తరలించారు.

బడులు పున:ప్రారంభం నాటికే ఏకరూప దుస్తులు

- 25 లక్షల మంది విద్యార్థుల కోసం రూ.121 కోట్లు
- 1,200 స్కూళ్లలో మన ఊరు-మనబడి నిర్మాణ పనులు పూర్తి
- విద్యామంత్రి సబితా ఇంద్రారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, మధ్యతరగతి విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం (2023-24) బడుల పున:ప్రారంభ సమయంలోనే ఏకరూప దుస్తులను అందజేసేందుకు ఏర్పాట్లు చేయాలంటూ విద్యాశాఖ అధికారులను రాష్ట్ర మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ సంచాలకుల కార్యాలయంలో ఏకరూప దుస్తుల పంపిణీ, మన ఊరు - మన బడి కార్యక్రమంపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ఏకరూప దుస్తులను ధరించి తరగతులకు హాజరైతే వారిలో క్రమశిక్షణ ఏర్పడుతుందని ఆమె పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి 25 లక్షల మంది విద్యార్థులకు రూ.121 కోట్లతో ఏకరూప దుస్తులను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులందరూ ఒకే రకమైన దుస్తులు ధరించడం ద్వారా వారి మధ్య తారతమ్యాలు, ఎలాంటి కల్మషాలకు తావు లేకుండా ఉండే అవకాశం కలుగుతుందని మంత్రి తెలిపారు. వచ్చే సంవత్సరం ఏప్రిల్ నాటికి విద్యార్థులకు పంపిణీ చేసేందుకు జిల్లా స్థాయిలో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. మన ఊరు - మన బడి కార్యక్రమంలో మొదటి దశలో చేపట్టిన పాఠశాలల్లో 1,200 స్కూళ్లలో నిర్మాణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. వాటిలో సీసీ కెమెరాలు, ఫర్నీచర్, ఉన్నత పాఠశాలల్లో క్రీడా మైదానాలను వచ్చేనెల 15 నాటికి సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మిగతా పాఠశాలల్లో కూడా పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో విద్యా శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, పాఠశాల విద్యాశా సంచాలకులు శ్రీదేవసేన పాల్గొన్నారు.

ఆనెం చంద్రారావును కోర్టులో హాజరుపర్చాలి

- పౌరహక్కుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆనెం చంద్రారావును వెంటనే కోర్టులో హాజరుపర్చాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎన్ నారాయణ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఎన్ఎస్ఎస్‌లో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన భారత్ బచావో కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన చంద్రారావును పోలీసులే కిడ్నాప్ చేశారనీ, ఇప్పటి వరకు ఆచూకీ తెలియకుండా ఉంచారని ఆరోపించారు. అతనిపై కేసులు ఏమైనా ఉంటే వెంటనే కోర్టులో హాజరు పర్చాలని డిమాండ్ చేశారు. స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను చెప్పుకునే హక్కును తెలంగాణ ప్రభుత్వం హరిస్తోందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో 25 భూటకపు ఎన్‌కౌంటర్లు, పది లాకప్‌డెత్‌లు జరిగాయని చెప్పారు. నీళ్లు, నిధులు, నియామకాలతో పాటు నిర్బంధంలేని రాష్ట్రంగా ఏర్పాటు కావాలని ఆకాంక్షించామని గుర్తుచేశారు. కానీ.. అందుకు భిన్నంగా పరిస్థితులున్నాయన్నారు. చంద్రారావు కిడ్నాప్‌తో తెలంగాణ ప్రభుత్వం మిస్సింగ్ కేసులకు తెరదీసిందని విమర్శించారు.

నీటి గుంటలో పడి ఇద్దరు పిల్లలు మృతి

మహబూబ్‌నగర్ జిల్లాలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్లాట్‌ను చూసేందుకు సంతోషంగా పిల్లలతో కలిసి వచ్చిన తల్లిదండ్రులకు గర్భశోకం మిగిలింది. వచ్చేటప్పుడు కొడుకులతో కబుర్లు చెప్పుకుంటూ వచ్చిన ఆ భార్యాభర్తలు పోయేటప్పుడు ఇద్దరు పిల్లల మృతదేహాలతో వెళ్లారు. ఆడుకుంటూ వెళ్లి పిల్లలు నీటి గుంటలో పడి విగతజీవులుగా మారారు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం పెద్దయ్యపల్లి శివారులో మంగళవారం జరిగింది ఎస్‌ఐ జయప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా చీరాల సమీపంలోని పాలెం గ్రామానికి చెందిన మస్తాన్‌రెడ్డి ఉద్యోగరీత్యా హైదరాబాద్ పటాన్‌చెరువులో నివాసం ఉంటున్నారు. బాలానగర్ మండలం పెద్దయ్యపల్లి శివారులో ప్లాట్ చూడటానికి కుటుంబంతో వచ్చారు. భార్యాభర్తలు స్థలాన్ని, పరిసరాలను చూస్తుండగా.. పిల్లలు అనూష్ పవన్‌రెడ్డి(8), యువ మనోజ్‌రెడ్డి(6) ఆడుకుంటూ వెళ్లి అక్కడే నీటి గుంటలో పడిపోయారు. అది గమనించిన తల్లిదండ్రులు పరిగెత్తుకుంటూ వచ్చి పిల్లలను వెంటనే బయటకు తీశారు. అప్పటికే ఒకరు మృతిచెందారు. మరో బాలున్ని హైదరాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆ బాలుడూ చనిపోయాడు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

నీటి గుంట

మహిళా హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి
- వరంగల్ జిల్లా ఐద్వా మహాసభ ర్యాలీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హక్కుల సాధన కోసం మహిళలు ఐక్యంగా ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) వరంగల్ జిల్లా ప్రథమ మహాసభ సందర్భంగా నగరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. వరంగల్ చౌరస్తా నుంచి వరంగల్ హెడ్‌పోస్ట్ ఆఫీస్ మీదుగా వరంగల్ రైల్వేస్టేషన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టాలని, మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గరికపాటి, రాందేవ్‌బాబా వంటి వాళ్లను వెంటనే శిక్షించాలని నినదించారు. అనంతరం జరిగిన సభలో మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా మహిళలకు రక్షణ లేక అభద్రత భావానికి లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భారత్ మాతాకీ జై అంటూనే మహిళల పట్ల అగౌరవంగా మాట్లాడుతున్నారని విమర్శించారు.

బిజెపి, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలైన మనువాద, మతోన్మాద భావజాలంతో మహిళలను అణిచివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. గ్రాడ్యుయేషన్, పిహెచ్‌డిలు చేసిన మహిళలు, యువతులు ఉద్యోగాలు లేక, కూలీ పనులకు వెళ్తున్న దౌర్భాగ్య పరిస్థితులు నేడు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన ధరలతో మహిళలు పౌష్టిక ఆహారం లేక అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించి, వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చూపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల, నాయకులు చీర కవిత, మాలోతు ప్రత్యూష, వాణి, రేణుక పాల్గొన్నారు.

ర్యాలీలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత కెసిఆర్‌దే

- భైంసాలో ఐదో విడత ప్రజాసంగ్రామ యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత సిఎం కెసిఆర్‌దేనని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ అన్నారు. నిర్మల్ జిల్లా భైంసాలో మంగళవారం ఏర్పాటు చేసిన ఐదవ విడుత ప్రజాసంగ్రామ యాత్ర బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కెసిఆర్ కుటుంబ పాలన కొనసాగుతోందన్నారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ భృతి కల్పిస్తామని చెప్పి ఎనిమిదేళ్లు గడుస్తున్నా దాని ఊసే ఎత్తడం లేదని తెలిపారు. అదే కేంద్ర ప్రభుత్వం 75 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. ప్రజా సంగ్రామ యాత్ర భైంసా నుంచి ప్రారంభిస్తుంటే సున్నితమైన ప్రాంతమంటూ పోలీసులు అడ్డుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. కోర్టు ఇచ్చిన సమయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజా సంగ్రామ యాత్ర, సభను భైంసాకు మూడు కిలో మీటర్ల దూరంలో ఏర్పాటు చేశామని తెలిపారు. కెసిఆర్ నియంత పాలనకు ప్రజలు చరమగీతం పాడాలన్నారు. రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. భైంసా పట్టణాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తామని చెప్పారు. రాష్ట్రంలోని యువకులకు ఉచిత విద్యా వైద్యం అందేలా చూస్తామన్నారు. ఇండ్లు లేని వారికి పక్కా ఇళ్లు కట్టిస్తామన్నారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ డిసిసి అధ్యక్షులు పవర్ రామారావు పటేల్ బిజెపిలో చేరారు. ఆయనకు పార్టీ అధ్యక్షులు బండి సంజయ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బహిరంగ సభలో ఆదిలాబాద్ ఎంపి సోయం బాపురావు, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపిలు, జిల్లా అధ్యక్షులు రమాదేవి పాల్గొన్నారు.

నవతెలంగాణ ఆదిలాబాద్ మేనేజర్‌కు పితృవియోగం

ఎడిటర్, సిజిఎం సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నవతెలంగాణ ఉమ్మడి ఆదిలాబాద్ రీజనల్ మేనేజర్ కొలిపాక నాందేవ్ తండ్రి కొలిపాక చిన్నన్న(70) అనారోగ్యంతో మంగళవారం తెల్లవారుజామున మృతిచెందారు. ఆదిలాబాద్ జిల్లాలోని సొంత గ్రామం బేల మండలం సాంగిడిలో అంత్యక్రియలు నిర్వహించారు. చిన్నన్న మృతికి నవతెలంగాణ ఎడిటర్ ఆర్ సుధాభాస్కర్, సిజిఎం ప్రభాకర్ సంతాపం తెలిపారు. చిన్నన్న భౌతికకాయాన్ని నవతెలంగాణ ఆదిలాబాద్ రీజినల్ డెస్క్ ఇన్‌చార్జ్ రాపర్తి దత్త్రాత్రి, స్టాఫ్ రిపోర్టర్ మెడపట్ల సురేష్, డివిజన్ ఇంఛార్జీలు ఉష్కం సురేష్, గోపికృష్ణ, జయరావు, సబ్ ఎడిటర్లు గాజరి మహేష్, కొండ రాజన్న, విలేకరులు, కార్యాలయ సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, సీనియర్ నాయకులు లంక రాఘవులు పాల్గొన్నారు.

ఎర్రబోడు వలస ఆదివాసీల పట్ల వివక్ష తగదు

- తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలంలోని బెండలపాడు గ్రామపంచాయతీ ఎర్రబోడు గ్రామ ఆదివాసీలను గ్రామ బహిష్కరణ చేయడం సరికాదని, వలస ఆదివాసీల పట్ల వివక్ష చూపడం తగదని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టిఎజిఎస్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వజ్జా సురేష్, సరియం కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎర్రబోడు ఆదివాసీ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒకరిద్దరు చేసిన తప్పుకు గ్రామాన్ని బహిష్కరించడం సరికాదన్నారు. గ్రామసభ చేసిన తీర్మానాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. రేంజర్ శ్రీనివాసరావు హత్య జరిగిన సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. రేంజర్ మరణించడం బాధాకరమని, దానికి కారకులైన వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆ సంఘటన కారణంగా చూపించి ఆదివాసీ గ్రామాన్ని వెలి వేయడం సరికాదన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలను ఆదివాసీల అభివృద్ధి కోసం ఉపయోగపడాలే తప్ప వారిని అణిచివేయడానికి కాదని చెప్పారు. ఎర్రబోడు గ్రామ ప్రజలకు ఆధార్, ఓటర్ కార్డులు, ఇతర ప్రభుత్వ గుర్తింపు కార్డులు అన్నీ ఉన్నాయని, బలవంతంగా గ్రామాన్ని ఖాళీ చేయించాలని చూడటం తగదన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ వలస ఆదివాసీల పట్ల మాట్లాడిన మాటలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు గౌరీ నాగేశ్వరరావు, మడివి రమేష్, ముక్తి రామకృష్ణ, కాకా హనుమంతు, పోడియం వెంకటేశ్వర్లు, కాకా పాపారావు, అదేం కూర అయ్యి గుర్రాయి గూడెం సర్పంచ్ కాక సీత పాల్గొన్నారు.

నక్షా మార్చి.. కక్ష్య ఏమార్చి..!

- ఇష్టానుసారంగా ఆర్అండ్‌బి రోడ్డు నిర్మాణం
- రైతుల పట్టా భూములు దురాక్రమణ
- వెంచర్ నిర్వాహకుల కోసం రూట్ ఛేంజ్
- ఖమ్మం రూరల్ మండల అధికారుల తీరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నలుగురూ నడిచినంత మాత్రాన అది బాట కాదు.. సాధారణ వ్యక్తులు ఒకవేళ అది బాట అని వాదించినా.. అన్నీ తెలిసిన అధికారులు మాత్రం ఆ మాట అనడానికి వీల్లేదు. ముఖ్యంగా రోడ్లు, భవనాలశాఖ అధికారుల నుంచి ఆ మాటే రాకూడదు. ఓ వెంచర్ నిర్వాహకుడు తన సౌలభ్యం కోసం నక్షా మార్చి రూట్ ఛేంజ్ చేశాడు. దాన్నే ప్రామాణికంగా తీసుకుని అధికారులు ఓ లెక్కాపత్రం లేకుండా రోడ్డు నిర్మిస్తుండటం వివాదానికి దారితీసింది. ఒకవేళ ఆ రోడ్డు ప్రభుత్వ భూమిలో నుంచి పోతే ఇబ్బంది లేదు. కానీ రూ.కోట్ల విలువ చేసే రైతుల పట్టా భూముల్లో నుంచి నిర్మిస్తుండటంతో సదరు రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. మార్చి నెలలో సర్వేకు అప్పీల్ చేసినా అధికారులు పట్టించుకోకపోగా రోడ్డు నిర్మాణం చేపట్టడంతో కలెక్టర్ విపి గౌతమ్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో స్పందించిన ఖమ్మం రూరల్ మండల అధికారులు సర్వేయర్, ఆర్అండ్‌బి అధికారులు, తహసీల్దార్.. ఇలా ఒకరి తర్వాత ఒకరు వచ్చి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రభుత్వ భూమిని వెంచర్ నిర్వాహకుడు కబ్జా చేయగా.. రైతుల పట్టా భూముల్లో నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టినట్టు గ్రహించారు. ఇప్పుడేం చేయాలో అర్థంకాక ఇన్నాళ్లూ ఏమి చేశారంటూ..? నెపాన్ని రైతుల మీదకు నెట్టివేస్తుండటం ఆశ్చర్యంగొల్పుతోంది.

అసలు రోడ్డు మాయచేశారు..?

ఖమ్మం నగరానికి ఆనుకొని ఉన్న వరంగల్ క్రాస్‌రోడ్డు నుంచి సెయింట్ జోసఫ్ స్కూల్ వెనుక భాగం మీదుగా ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడు వెళ్లేందుకు రోడ్డు ఉండేది. ఆక్రమణలో ఇది కుచించుకుపోయి 30 అడుగులకు చేరింది. ఈ మార్గంలో సత్యసంకల్ప టౌన్‌షిప్ పేరుతో సర్వే నంబర్ 51, 52, 72లో 17 ఎకరాల విస్తీర్ణంలో వెంచర్ వేశారు. 51, 52 సర్వేనంబర్ల మధ్యలో నుంచి గుర్రాలపాడు వెళ్లేందుకు కిలోమీటర్‌కు పైగా ప్రభుత్వ రోడ్డు ఉండేది. ఈ రోడ్డును వెంచర్ నిర్వాహకులు తమ స్థలంలో కలుపుకున్నారు. ఆక్రమించిన స్థలంలో ఇళ్ల నిర్మాణమూ చేశారు. తద్వారా ఈ సర్వే నంబర్లకు ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 31లోని రైతుల పట్టా భూముల మీదుగా రోడ్డు నిర్మాణం చేపట్టడం వివాదానికి దారితీసింది.

నక్షాను విస్మరించి...

వరంగల్ క్రాస్‌రోడ్డు నుంచి గుర్రాలపాడు వెళ్లేందుకు నక్షాలో స్ట్రెయిట్‌గా 51, 52 సర్వే నంబర్ల మీదుగా రోడ్డు క్లియర్‌గా కనిపిస్తుంది. నక్షా ప్రకారం రోడ్డు వెళ్తే సత్యసంకల్ప వెంచర్లో దాదాపు ఎకరం భూమికి పైగా పోతుంది. పది దాకా ఇళ్లు పోతాయి. ఓ భారీ బిల్డింగ్ సైతం పోతుంది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకునే వెంచర్ నిర్వాహకులు 'దారి'మళ్లించారని నక్షాను బట్టిచూస్తే స్పష్టంగా అర్థమవుతుంది. మార్గంమధ్యలో ఉన్న ఓ కాల్వను తప్పించడం కోసం దానిపై ఓ కల్వర్టును కూడా వెంచర్ నిర్వాహకులు నిర్మించారు. ఈ కల్వర్టు పైనుంచి చూస్తే వెంచర్ ప్రహరీగోడ రోడ్డుకు అడ్డంగా కనిపిస్తుంది. అయినా అధికారులు ఇవేవీ పట్టించుకోకుండా రోడ్డు నిర్మాణం చేపట్టడం.. రైతులు నిలదీయడంతో ఇప్పుడు ఆ ప్రాంతంలో నిర్మాణం ఆపడం.. పైపెచ్చు రైతులు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని నిందలు వేస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రోడ్డువేయాలంటే ఈ చేయాలి..? ఏం చేశారు??

పంచాయతీరాజ్ నిధులు కేటాయించి అనుమతి ఇవ్వడంతో ఆర్అండ్‌బి అధికారులు రోడ్డు నిర్మాణం చేపట్టారు. రెవెన్యూ అధికారులు పరిశీలించి ఆర్అండ్‌బికి పంపారు. కొన్నాండ్ల కిందట ఉపాధిహామీ చట్టం కింద ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. అప్పటికే వెంచర్ నిర్వాహకులు ఆక్రమించుకోవడంతో నక్షాను తప్పించి ఉన్న రోడ్డుపైనే మరమ్మతులు చేపట్టారు. నక్షాను పరిగణలోకి తీసుకోకుండా ఇప్పుడు అదే రోడ్డుపై కాంట్రాక్టర్ నిర్మాణం చేపట్టారు. రెవెన్యూ స్కెచ్ ఇచ్చారా? వర్క్‌శాంక్షన్ ఆర్డర్ కాపీలో ఎలా ఇచ్చారు? ఇవేవీ అంతుచిక్కని ప్రశ్నలుగా ఉన్నాయి. ఇదే విషయమై కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తే.. మార్కింగ్ ప్రకారం నిర్మాణం చేపట్టామని, వర్క్ ఆర్డర్ కాపీలో రోడ్డు ఎక్కడి నుంచి ఎక్కడికి అనేది తప్ప మిగతావేవీ లేవని తెలిపారు.

రోడ్డు నిర్మాణం నిలిపివేశాం

సర్వే నంబర్ 31లోని పట్టా రైతులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రోడ్డు నిర్మాణం నిలిపివేశాం. ముందుగానే రైతులు గుర్తించాలి. అప్పటికే రహదారి ఉండటంతో దానిపైనే నిర్మించాం. నక్షాలో దారి ఎలా ఉందో రైతులకు తెలియదా? నక్షాను తప్పించారనుకున్న వెంటనే కంప్లైంట్ చేయాలి. దీనిపై ఓ స్పష్టత వచ్చేంత వరకూ రోడ్డు నిర్మాణం చేపట్టం.

- శ్యాంప్రసాద్, ఆర్అండ్‌బి ఇఇ, ఖమ్మం

మీడియాతో మాట్లాడుతున్న ప్రభాత్ సెతియా

రూ.300 కోట్లతో ఫిలాటెక్స్ ఫ్యాషన్స్ విస్తరణ

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ సాక్స్‌ల తయారీదారు ఫిలాటెక్స్ ఫ్యాషన్స్ లిమిటెడ్ విస్తరణ కోసం రూ.300 కోట్ల పెట్టుబడులను పెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ సంస్థ కాంట్రాక్టు సాక్స్‌ల తయారీతో పాటు సొంత బ్రాండ్లను కలిగి ఉంది. హైదరాబాద్‌లో ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రభాత్ సెతియా మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. నగర సమీపంలోని గండి మైసమ్మ పారిశ్రామిక వాడలో గత రెండు దశాబ్దాలుగా తాము ఉత్పత్తిని కలిగి ఉన్నామన్నారు. ఇక్కడ కొత్తగా మరో 500 మిషన్లను అందుబాటులోకి తేనున్నామన్నారు. వచ్చే ఏడాదిన్నరలో విస్తరణ పూర్తి కానుందన్నారు. ప్రస్తుతం ఏడాదికి 70 లక్షల సాక్స్‌లను తయారు చేస్తున్నామన్నారు. తమ విస్తరణ పూర్తయితే ఏడాదికి ఇది మూడు కోట్ల తయారీ సామర్థ్యానికి చేరనుందన్నారు. అదే విధంగా రెండు వేల మందికి ప్రత్యక్ష ఉపాధి లభించనుందన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.110 కోట్ల టర్నోవర్ సాధించామని ఈ ఏడాది రూ.120 కోట్లుగా ఉండొచ్చన్నారు.